పురుషులకు ప్రత్యేకం



# దాన రహస్యం

— కేశవరావ్

ఆ ఊరు వెడితేగాని... పేరేమిటన్న అనుమానం వచ్చిందా? పోనీ ఆ ఊరుని 'ఆ వూరు' అని అందాం. సరేనా! ఆ వూరు చేరితేగాని జమీందారీ వ్యవస్థ రద్దయినా, జమీలు (భూములు) న్యాయ బద్ధంగా పోయినా, జమీందార్లు జమీందార్లుగా హుందాగా, భోగభాగ్యాలతో కొనసాగుతూ ఉన్నారని తెలీలేదు. బినామీ పేర్లతో (అనామకులైన చుట్టాలు, పక్కాలు, పాలేర్లు పేర్లన, భూములను బదలాయించి ప్రభుత్వానికి భూములు సంక్రమించకుండా చేసి) తమ భూములు తమ హక్కు భుక్తంలోనే ఉంచు కున్నారని తెలిసింది.

అయితే ఆ వూరు జమీందారుగారికి (పేరుతో పనిలేదు. చాలామందికి ఆయన పేరూ తెలీదు) చాలా పేరు ఉందని, అపరదానకర్ణుడని అతి తక్కువ వ్యవధిలోనే గ్రహించాను. ఆయనను చూడ లేదుగాని, ఆయన కారుని చూసాను. ఆయన ఫొటోని చూసాను. ఆయనంటేనేకాదు, ఆయన కారు అన్నా ఆయన ఫొటో అన్నా జనానికి ఎంత గౌరవమో, ఎంత భక్తో అర్థం అయింది. భయం నుంచి భక్తి పుడుతుందన్నది నిజమేనేమోగాని, దాని చర్చ, జమీందారు ప్రజలను ఎలా భయపెట్టారనే ప్రస్తావన ప్రస్తుతం అప్రస్తుతం.

ఉన్నఊళ్ళో కొట్టలమ్ముకునే పరిస్థితి ఏర్పడి, భుక్తి కోసం, బతుకుకోసం ఊళ్ళమీద పడి, తిరుగుతూ ఆ వూరు చేరుకున్న నాకు ప్రజల మాటలను బట్టి, మంచి ఊరు చేరానని అనిపించింది. నలభయ్యోపడిలో పడిన నేను, నా శేషజీవితం ఇక్కడే ఏ సమస్యా లేకుండా తృప్తిగా వెళ్ళదీయచ్చన్న ధీమా ఏర్పడింది.

జమీందారుగారు బంగారంలాంటి అయిదెకరాలు మాగాణి భూమిని తనకు మాన్యంగా ఇచ్చారని పూజారి చెబితే, దేవుడిమీద భక్తితో, దేవుడిని నమ్ము కున్నవానిపై గౌరవంతో ఇచ్చారని అనుకుంటారు. పాఠశాలకి మూడెకరాల స్థలం ఇచ్చారంటే చదువు మీద ఆపేక్ష అనుకుంటారు. మనుష్యుల ఆసుపత్రికి ఏడెకరాలభూమి, పశువుల వైద్యశాలకి నాలుగు ఎకరాల బంజరు ఇచ్చారంటే మనుష్యుల, పశువుల ఆరోగ్యం గురించి ఎంత శ్రద్ధో అనుకుంటారు. ఆ ఊళ్ళోని వేద పండితులకు మాన్యం ఇచ్చారంటే బహుశా భక్తి అనుకుంటారు. క్రైస్తవులకు చర్చి, ముస్లింలకు మశీదు కట్టుకోడానికి స్థలం ఇచ్చారంటే సర్వమత సౌభ్రాతృత్వం అనుకుంటారు. అనుకోరా? జమీందారుగారు ఇవన్నీ చేసారు, చేస్తున్నారు అంటే ఎంత గొప్పవారై ఉంటారు మరి! సంస్థలకు, ప్రజాహిత కార్యక్రమాలకు భూరీ విరాళాలు, దానాలు ఇచ్చారంటే అవి పేరు ప్రతిష్ఠల కోసం అనుకోవచ్చు. అలా ఇవ్వాలన్నా అందుకు తగ్గ మంచి మనసు ఉండాలి కదా! అది అందరికీ ఉంటుందా?

ఇంతేకాదు వ్యక్తులక్కు కూడా దాన ధర్మాలు చేస్తా రంటే ఆయన మనసు ఎంత గొప్పదో మరి!

అందరినీ పలకరించడం, పరిచయం చేసుకోడం నా అలవాటు. జమీందారుగారిని కలుసుకునేందుకు వీలు కుదరడం లేదు. నాకు కుదరక కాదు. ఆయనకు కుదరక.

"ఏమయ్యా! ఈ స్థలం నీదేనా! నీ స్వంతమేనా?" అని అడిగితే, "అవునండయ్యా! నాదే జమీందారు గారు ఇచ్చారు. గుడిసె లేసుకున్నాను.... పాక వేసు కున్నాను.... ఇల్లు కట్టుకున్నాను." అనే సమాధానం వస్తుంది.

"ఏమోయ్! ఈ పొలం నీ స్వార్జితమా? పిత్రార్జితమా?" అని ప్రశ్నిస్తే, "నా ఆర్జితమే నండి" అనో, "మా బాబు (తండ్రి) దనే మాటతో బాటు "జమీందారు గారు...జమీందారుగారి తండ్రిగారు ఇచ్చారండి" అనే ముక్తాయింపు కూడా రావడం సహజం.

రోజూ ఇలా వింటూంటే, ఆర్నెల్ల తర్వాత నాకో ఆలోచన వచ్చింది. జమీందారుగారికి నా స్థితి వివరించి, ఉండటానికి ఓ నివాస స్థలం, వ్యవసాయానికి కొంత భూమి అడిగితే.... ఇక్కడే ఈ మంచి మనుషుల మధ్య స్థిరపడిపోవాలనిపించింది.

ఉన్నది దానం చేస్తున్న చేసిన ఆ జమీందారు వద్ద ఇవ్వడానికి ఇంకేమైన మిగిలిందో? లేదో? అందుకే గ్రామ కరణంగారిని కలిశాను.

నేను అడిగిందంతా విని, "ఇంతేకదా! ఏదో పెద్ద విషయం అనుకున్నాను. ఇవ్వడానికి ఆయన దగ్గర లేక పోవడమేమిటి? ఆయనను ప్రసన్నం చేసుకోడమే తరువాయి. నీకు తగిన స్థోమతు ఉందా మరి?" అన్నారు కరణంగారు.

ఎదుటి వ్యక్తిని ప్రసన్నం చేసుకోడం నాకు పెద్ద కష్టమేమీ కాదు. స్థోమతు ఉందా అని నన్ను ఈయన అడుగుతున్నారేమిటి?- అనిపించింది.

ఏదో పనిపడి, ఆవూరుకు దూరంగా ఉన్న మరో ఊరు వెళ్ళాల్సి వచ్చింది కొన్నాళ్ళ తర్వాత.

"ఎలా ఉన్నావు? ఆవూరు లోనే ఉన్నావా?" అని ప్రశ్నించాడు తారసపడ్డ మిత్రుడు.

"ఆ వూరులోనే! ఏదో ఇలా ఉన్నాను. 'పెట్టను కొట్టి పొయ్యిలో పెట్ట' అన్నట్టు ఉంది. వయసా ఉడిగిపోతుంది. నిలవడానికి నీడకూడా లేదు." అన్నాను.

"మాంసాహారం ఎప్పుడు మొదలెట్టావు? అయినా ఈ వయసులో జీవకారుణ్యం పెరగాల్సింది పోయి, జీవరాహిత్యం వేపు మొగ్గుతున్నావేంటి? చెట్టునీడన నిలబడ్డాం అయినా నీడ లేదంటావేంటి?" అని ప్రశ్నలు కురిపించాడు.

"నీకంతా వేళాకోళమే!" అని చిరుకోపం ప్రదర్శిస్తూ జమీందారుని కలిసి, అడగాలనుకుంటున్న అంశం

గురించి వివరించాను.

అతను భళ్ళున నవ్వాడు. నాకు అర్థం కాలేదు. అడిగినా జవాబివ్వలేదు.

"నాతోరా" అని ఓ ఇంటికి తీసుకెళ్ళాడు.

ఇంటి యజమానిని పరిచయం చేసి, నా పరిస్థితి వివరించాడు.

ఇంటి యజమానిని చూడగానే నే చూసిన ఫొటో గుర్తొచ్చింది.

ఆయన నావిషయం విని, జాలి పడుతూ, ఇంట్లో కెళ్ళారు.

దొరికిందే అదనుగా, ఆయన గురించి అడిగాను మిత్రుణ్ణి.

"మీ జమీందారుగారి తమ్ముడు" అన్నాడు.

ఆశ్చర్యపోయాను. ఫొటో ప్రకారం అయితే ఆయన కన్న పెద్దవాడులా కనిపిస్తున్నారే! పైగా హోదా, అంతస్థు కూడాలేదు.

ఇంతలో ఇంటి యజమాని వచ్చి, "బాబూ ఇంత కన్నా నాదగ్గర ఏమీలేదు. దీనితో ఏదైనా వ్యాపారం జాగ్రత్తగా చేసుకుని అభివృద్ధిలోకిరా! రెండువేలే ఉన్నాయి. అనవసర భ్రమల్లో పడకు" అన్నారు.

నేను సంకోచించాను.

"వారు ఇచ్చేస్తున్నారు. తీసుకో. ఇందాకటి నీ ప్రశ్నకు జవాబు కూడా దొరుకుతుంది" అని తొందర పెట్టాడు మిత్రుడు.

బయటకు వచ్చాక "అన్నగారు ఇస్తారు. తమ్ముడు ఇచ్చేస్తారు. అంతే తేడా! అందుకే తమ్ముడు కరిగి పోతున్నారు. అన్న అలా ఉన్నాడు" అన్నాడు మిత్రుడు.

నాకేం అర్థం కాలేదు.

"తమ్ముడు మెతక మనిషి. మొహమాటం, బిడియం ఎక్కువ. ఎవరినీ కాదనలేడు. అది తెలిసి, తమ్ముడిని మోసగించి, జమీందారీలో ఎక్కువభాగం అన్న కైవసం చేసుకున్నాడు. తమ్ముడు తన సహజధోరణిలో అడగని వాడిది పాపం అన్నట్టు ఇచ్చేస్తూ కరిగిపోతున్నారు. ఇక అన్నగారు అదే ఆవూరు జమీందారుగారి సంగతి. ప్రభుత్వం బీదా బిక్కీకి ఉచితంగా పట్టాల రూపంలో ఇచ్చే నివాస స్థలాలు, పొలాలని తనే ఇస్తున్నట్టుగా (కరణంని తన చెప్పుచేతల్లో ఉంచుకుని) ఆర్భాటం చేస్తారు. జమీందారుగారు తన స్వంత భూమి దానం చేస్తున్నారనే భ్రమ కల్పిస్తారు. ఆ ఖర్చులు, ఈ ఖర్చులు అంటూ దాని ఖరీదులో నగం (ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే భూమిని) రాబట్టుకుంటాడు వాళ్ళకి నొప్పి తగలకుండా. అంతేకాదు దేవుడి భయం పెట్టి, దేవుడికోసం అంటూ ఎకరానికి బస్తాయో, రెండు బస్తాల ధాన్యమో ప్రతిఏడూ తన ఇంటికి వచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటాడు. ఇంక సంస్థలకు భూములు దానంచేస్తే, భూములపై కట్టే కట్టడాల కాంట్రాక్టులు ఆయనే తీసుకుంటారు. తద్వారా దానం చేసిన భూమి ఖరీదుకి పదిరెట్లు మిగుల్చుకుంటారు. పేరూ ఉంటుంది. ఊరికే ఇవ్వక పోయినా, ఇచ్చిన భ్రమ ప్రజల్లో ఉంటుంది. ఎవరికైనా ఆయన 'అమ్మినా' అది ఇచ్చినట్టే పరిగణించాలి. అందుకే జమీందారు గారు'ఇచ్చారు' అని గొప్పగా చెబుతారు. చెప్పకపోతే వాడికి యమయాతనలు తప్పవు. ఇదే ఆవూరు జమీందారు కథ" అని వివరించాడు.

నాకు నమ్మశక్యం కాలేదు.

ఆవూరు వెళ్ళి రహస్యంగా కూపీ లాగాను. 'ఇచ్చారు'కి, 'ఇచ్చేసారు'కి తేడా అర్థంఅయింది. దానరహస్యం అర్థం అయింది. "నీకు తగిన స్థోమతు ఉందా?" అని కరణం అనడం లోని అంతరార్థం తెలిసింది. ఇక ఆ ఊరులో ఉండబుద్ధి కాలేదు. □

# ఒత్తిడికి లొంగిపోకండి! ఒత్తిడిని లొంగదీసుకోండి!



కాలం వేగంగా కదులుతుంది. కాలంతో పోటీపడ డానికి మనిషీ వేగం అందుకోవాలి. ఉన్నచోట నిలబడి ఓటమి అంగీకరించడానికి ఎవరూ ఇష్టపడరు. అటు వంటప్పుడు, కాలంతో పోటీపడేటప్పుడు మనిషి ఎంతో ఒత్తిడికి గురవుతాడు-మానసికంగానూ, శారీర కంగానూ.

ఈ మానసిక ఒత్తిడే జీవితంలో ఎంతో చెడు ప్రభావాన్ని చూపిస్తుంది. భయం, చింత, ఆందోళన, కోపం, ఉద్రేకము, ఆఖరికి ఆనందం కారణంగా ఒత్తిడి కలుగుతూ వుంటుంది.

వైద్యులు అనారోగ్యానికి కారణమైన అనేక సమస్య లకి ఒత్తిడే కారణమని చెప్తారు. ఈ రోజున ఆధునిక నాగరిక ప్రపంచంలో నివసిస్తున్న మనిషి యుద్ధ రంగంలో వున్నట్లే భావించాలి. దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షు అన్నట్లు అను నిత్యమూ సమస్య లను ఎదుర్కొంటూ ఎంతో ఒత్తిడికి మనిషి గురవు తున్నాడు. ఈ ఒత్తిడివలన శారీరకంగానూ, మానసికం గాను లక్షన్నర సమస్యలు ఎదురవుతాయి.

పెద్దపెద్ద బాధ్యతాయుతమైన పదవులలో వున్నవారు, క్షణం తీరికలేనివారు మాత్రమే ఒత్తిడికి గురవుతారను కుంటాము. కానీ ఒత్తిడి నుంచి తప్పించుకోగల వారెవరూ వుండరు. అయినా ఒత్తిడిని 'అణచి' వుంచడానికి ప్రయత్నించాలి. ఒత్తిడికి మనిషి అణిగి పోతే అంతే!

## మానసిక ఒత్తిడికి కారణాలు ఏమిటి?

(1) ప్రియమైన వారి మరణం
(2) విడాకులు లేక విడిపోవడం
(3) తీవ్రమైన వ్యాధి లేక గాయం
(4) ఇల్లు మారడం
(5) జైలుకి వెళ్ళడం
(6) పెళ్ళి అవడం
(7) మితిమీరిన పని లేక ఉద్యోగ విరమణ
(8) గర్భవతిగా వుండడం లేక పాప పుట్టడం
(9) అప్పులలో మునగడం
(10) కొత్త ఉద్యోగంలో ప్రవేశించడం

## ఒత్తిడికి గురవుతున్నారని తెలిపే లక్షణాలు

(1) తలనొప్పి
(2) ఛాతీ నొప్పి
(3) నిద్రపట్టకపోవడం
(4) అలసట
(5) విరోచనాలు
(6) అజీర్ణం
(7) గుండెదడ
(8) ఊపిరి ఆడకపోవడం

ఇవి శారీరక సంబంధమైనవి. ఇవికాక మానసిక మైనవీ వున్నాయి. అవి:

(1) చికాకు
(2) జ్ఞాపకశక్తి తగ్గడం
(3) ఏకాగ్రత లోపించడం
(4) అనుకోకుండా ఏడవడం
(5) చిన్నచిన్న సమస్యలకి కంగారుపడి పోవడం
(6) విశ్రాంతి కరువవడం
(7) శబ్దాన్ని భరించలేకపోవడం
(8) అర్థంలేని ప్రవర్తన

శారీరకంగానూ, మానసికంగానూ విశ్రాంతి లభించినప్పుడు ఒత్తిడి దానంతట అదే దూరమవు తుంది. మామూలుగా నిద్రపట్టేటట్లు చూసుకోవాలి. నిద్రమాత్రలువాడడం మానుకోవాలి. చకచకా పనులు పూర్తి చేయాలనే ఆతృత వుండకూడదు. నూది మీద పడితే కొండ విరిగి మీద పడిందనే తత్త్వానికి వీడ్కోలు చెప్పాలి. చిన్నచిన్న పనులకే పెద్దగా కంగారు పడడం మానెయ్యాలి. అనవసరమైన ప్రతి విషయానికీ ఆలోచ నలతో బుర్ర పాడుచేసుకోకూడదు. తలకు మించిన భారం మోస్తున్నట్లు కృంగిపోకూడదు. ఉద్రేకాన్ని ఉత్సాహాన్ని హద్దుల్లో పెట్టుకోవాలి. ప్రయోజనంతో జీవితాన్ని తీర్చి దిద్దుకోవాలి. ఆత్మ విశ్వాసం పెంచు కోవాలి. మిమ్మల్ని మీరు తక్కువగా అంచనా వేసు కోవడం మానెయ్యాలి.

ఆఖరుకు ఒత్తిడికి లొంగిపోకూడదు. ఒత్తిడిని లొంగతీసుకోవాలి. అప్పుడే నూరేళ్లూ బ్రతుకుతారు-ఆరోగ్యంగా, ఆనందంగా!